పరిగిలో జెండా ఊపి వాహనాలను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

సాగునీటికి శాపంగా ప్రభుత్వ నిర్ణయాలు

పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి

పరిగి, ఫిబ్రవరి 13 : కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు సాగునీటి రంగానికి శాపంగా మారనున్నాయని పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి పేర్కొన్నారు. కృష్ణా నదిపై గల ప్రాజెక్టులను తెలంగాణ ప్రభుత్వం కేఆర్ఎంబీకి అప్పగించడాన్ని నిరసిస్తూ, ప్రజా ఉద్యమ నిర్మాణంలో భాగంగా మంగళవారం సాయంత్రం నల్గొండలో జరిగిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ బహిరంగ సభకు పరిగి నియోజకవర్గం నుంచి పార్టీ నాయకులు, రైతులతో వెళ్తున్న వాహనాలకు పరిగిలో మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ నాయకత్వంలోని పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో కృష్ణా నీటిని సద్వినియోగం చేసుకుంటూ రైతులకు పంటల సాగుకు సాగునీరు అందించడంతో పాటు విద్యుత్ ఉత్పత్తికి, మిషన్ భగీరథ ద్వారా ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లోనే కృష్ణా నదిపై గల ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగించే నిర్ణయం తీసుకోవడం తెలంగాణ వ్యవసాయ రంగానికి పెను శాపంగా మారనున్నదన్నారు. ఢిల్లీలో జరిగిన సమావేశాల్లో ప్రాజెక్టుల అప్పగింతకు అంగీకరించిన ప్రభుత్వం బీఆర్ఎస్ పోరాట ప్రకటనతో దిగి వచ్చి ప్రాజెక్టులు అప్పగించబోమంటూ ఆదరాబాదరాగా అసెంబ్లీలో తీర్మానం చేయడాన్ని రైతులు గమనిస్తున్నారని పేర్కొన్నారు. ముందుగా ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలుపై ప్రభుత్వం దృష్టి కేంద్రీకరించాలన్నారు. రైతాంగానికి నష్టం జరిగే ఏ ఒక్క నిర్ణయాన్నీ బీఆర్ఎస్ చూస్తూ ఊరుకోదని, ప్రజా పోరాటాల ద్వారా ప్రభుత్వాన్ని ఎండగడతామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సురేందర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, సీనియర్ నాయకుడు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు వెంకట్‌రాంరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు హన్మంత్‌రెడ్డి, ముకుంద శేఖర్, రాజు పాల్గొన్నారు.

సమావేశంలో విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు

ఇష్టంగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలి

రంగారెడ్డి జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు

చేవెళ్లటౌన్, ఫిబ్రవరి 13 : విద్యార్థులు కష్టంగా కాకుండా ఇష్టంగా చదివి పదో తరగతి పరీక్షలో ఉత్తమ ఫలితాలను సాధించాలని రంగారెడ్డి జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు అన్నారు. మంగళవారం చేవెళ్లలోని ఓ ఫంక్షన్ హాల్‌లో చేవెళ్ల, షాబాద్, మొయినాబాద్, శంకర్‌పల్లి మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు విద్యాశాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. చదువు ద్వారానే పేదరికాన్ని నిర్మూలించవచ్చని, తద్వారా అభివృద్ధి సాధ్యమవుతుందని సూచించారు. బాగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించి మీ పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఒత్తిడికి లోను కాకుండా పరీక్షలు రాయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో చేవెళ్ల మండల విద్యాధికారి అక్బర్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సీఆర్పీలు ఉన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి

గ్రామపంచాయతీలను కించపరచడం మంత్రికి తగదు

సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి

కడ్తాల్, ఫిబ్రవరి 13 : చట్టాలు తయారు చేసే అసెంబ్లీ సమావేశాల్లో దేశానికి పట్టుకొమ్మలైన గ్రామపంచాయతీలను కించపరిచేలా మాట్లాడటం మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి తగదని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి మండిపడ్డారు. మంగళవారం కడ్తాల్‌లో పలువురు మాజీ సర్పంచ్‌లతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. సోమవారం జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో జరిగిన చర్చల సందర్భంగా అధికార పక్షానికి కౌంటర్ ఇస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావును ఉద్దేశించి.. గ్రామపంచాయతీల్లో మాట్లాడినట్లు చిల్లరగా మాట్లాడుతున్నావు అని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఎద్దేవా చేయడం ఆయన స్థాయికి తగదని తెలిపారు. మంత్రి చేసిన వ్యాఖ్యలు తెలంగాణలోని 12,769 గ్రామ పంచాయతీలను అవమానించడమేనని విమర్శించారు. గ్రామపంచాయతీల్లో జరిగే సమావేశాల్లో పార్టీలకతీతంగా ప్రశాంతమైన వాతావరణంలో గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి పనుల గురించి చర్చిస్తామన్నారు. జీపీల్లో జరిగే సమావేశాలు అభివృద్ధి కోసం జరుగుతాయని, గ్రామాభివృద్ధికై అనేక తీర్మానాలు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రస్తుతం తెలంగాణలో ఉన్న శాసన సభ్యులు, శాసనమండలి సభ్యులు గ్రామపంచాయతీల నుంచే రాష్ట్ర స్థాయికి చేరుకున్నవారు ఉన్నారన్నారు. గ్రామాలు అభివృద్ధి చెందినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని జాతిపిత గాంధీజీ కలలుకన్నారని, గ్రామపంచాయతీల్లో జరిగే చర్చల ద్వారానే గ్రామాలు అభివృద్ధి సాధిస్తాయన్నారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి గ్రామపంచాయతీలపై చేసిన వ్యాఖ్యలను ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నామని, వెంటనే మంత్రి తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ లచ్చిరాంనాయక్, మాజీ సర్పంచ్‌లు కృష్ణయ్యయాదవ్, తులసీరాంనాయక్, శ్రీనూనాయక్, నాయకులు రామచంద్రయ్య, అశోక్, రాజేందర్, జగన్, మహేశ్, శ్రీకాంత్, శ్రీశైలం, రాజు పాల్గొన్నారు.

కష్టపడితే లక్ష్యం సులభం

ఫిజికల్ డైరెక్టర్‌గా ప్రభుత్వ ఉద్యోగం పొందిన గాజీపూర్ గ్రామానికి చెందిన అమృత

పెద్దేముల్, ఫిబ్రవరి 13 : మండల పరిధిలోని గాజీపూర్ గ్రామానికి చెందిన బీరప్ప, రాములమ్మల కుమార్తె అమృత. తనది వ్యవసాయ కుటుంబం అయినా ఎన్ని కష్టాలు వచ్చినా చదువుకోవడం ఆపలేదు. చదువుతో పాటు క్రీడల్లోనూ రాణిస్తూ వచ్చింది. ఉన్నత చదువులను పూర్తి చేసింది. బేస్ బాల్ క్రీడల్లో ఉత్తమ ప్రతిభను కనబర్చింది. గతంలో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ క్రీడా పోటీల్లో బేస్‌బాల్ విభాగంలో అనేక బహుమతులు సాధించింది. ఒకవైపు కాంట్రాక్టు పద్ధతిలో ఉద్యోగం చేస్తూ ఎక్కడ కూడా నిరాశ చెందకుండా, దేనికి కృంగిపోకుండా ఆత్మ విశ్వాసంతో, పట్టుదలతో రాత్రింబవళ్లు కష్టపడి చదివి చివరకు ఫిజికల్ డైరెక్టర్‌గా ప్రభుత్వ ఉద్యోగం సంపాదించింది. గత సంవత్సరం ఫిబ్రవరి నెలలో నోటిఫికేషన్ వెలువడి ఆగస్టు నెలలో జరిగిన తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ రిక్రూట్‌మెంట్ బోర్డు(టీఆర్ ఈఐ-ఆర్‌బీ) ఆధ్వర్యంలో నిర్వహించిన జనరల్ రిక్రూట్‌మెంట్‌లో ఫిజికల్ డైరెక్టర్ నియామక పరీక్షలలో 13వ స్థానంలో మెరిసి ఫిజికల్ డైరెక్టర్‌గా ప్రభుత్వ ఉద్యోగం సాధించింది. అమృత ప్రభుత్వ ఉద్యోగం సాధించడంపై తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ ఆమెను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ విజయాన్ని తన తల్లిదండ్రులకు అంకితం ఇస్తున్నట్లు.. క్రీడల పట్ల ఆసక్తి ఉండడంతోనే తాను ఈ ఉద్యోగాన్ని సాధించానని పేర్కొన్నది. ఎన్ని అడ్డంకులున్నా ఎదిరించి చివరకు లక్ష్యాన్ని సాధించానని.. అందుకు సంతోషంగా ఉన్నదని, అందుకు సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు చెప్పింది.

చీమల్‌దరి దేశంలోనే నం.1

కేంద్ర టెలీ కమ్యూనికేషన్ మంత్రి దేవ్‌సిన్హ్ చౌహాన్

విద్యార్థులకు బ్యాగులను పంపిణీ చేస్తున్న మంత్రి దేవ్‌సిన్హ్ చౌహాన్ చిత్రంలో కలెక్టర్ నారాయణరెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి

వికారాబాద్, ఫిబ్రవరి 13 : చీమల్‌దరి గ్రామం దేశంలోనే నం.1 మోడల్ విలేజ్‌గా నిలిచిందని కేంద్ర టెలీ కమ్యూనికేషన్ మంత్రి దేవ్‌సిన్హ్ చౌహాన్ అన్నారు. మంగళవారం వికారాబాద్ జిల్లా మోమిన్‌పేట మండలం చీమల్‌దరి గ్రామంలో అందుతున్న బీఎస్ఎన్ఎల్ సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చీమల్‌దరి గ్రామంలో స్మార్ట్ డిజిటల్ స్కూల్, అంగన్‌వాడీ కేంద్రంలో ఆన్‌లైన్ ద్వారా సేవలు అందాయన్నారు. న్యూట్రిషన్, ఆరోగ్య సిస్టమ్, ఆధార్ సేవా కేంద్రానికి బీఎస్ఎన్ఎల్ సేవలు అందాయన్నారు. ఐపీటీసీ సదుపాయాలు ఇంటర్నెట్ ద్వారా అందుతున్న సేవలను పరిశీలించేందుకు వచ్చినట్లు తెలిపారు. గ్రామంలో బీఎస్ఎన్ఎల్ హై స్పీడ్ ఇంటర్‌నెట్ సేవలు అందుతున్నాయని గుర్తు చేశారు. అన్ని గ్రామాల్లో స్మార్ట్ సేవలను అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. దేశంలో 6 లక్షల గ్రామాల్లో ప్రతి ఇంటికి డిజిటల్ సేవలు అందిస్తామన్నారు. గ్రామీణ ప్రాంతం నుంచి పట్టణ ప్రాంతానికి అనుసంధానం చేయడం జరుగుతుందని వివరించారు. దేశాభివృద్ధికి డిజిటల్ కనెక్టివిటీ ఎంతో అవసరమని తెలిపారు. గ్రామాల్లో గ్రామ గ్రూప్ మహిళలు వారి ఉత్పత్తులను డిజిటల్ ఇంటర్నెట్ సదుపాయాల ద్వారా అంతర్జాతీయ స్థాయిలో విక్రయించుకోవచ్చన్నారు. చిన్న గ్రామంలో ప్రతి ఇంటికి ఇంటర్‌నెట్ సేవలు ఉండటం చాలా సంతోషించదగ్గ విషయమని కొనియాడారు. గ్రామాల అభివృద్ధికి బీఎస్ఎన్ఎల్ సేవలు ఎంతో ఉపయోగమని తెలిపారు. రాబోయే రోజుల్లో చీమల్‌దరి గ్రామానికి మరిన్ని సేవలు అందిస్తామని ఆయన పేర్కొన్నారు. అనంతరం పాఠశాల విద్యార్థులకు బ్యాగులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి, కలెక్టర్ నారాయణరెడ్డి, బీఎస్ఎన్ఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ శ్రీనివాస్, ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ సుజాత, ఆర్డీవో విజయకుమారి, సర్పంచ్ నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న అధికారులను సన్మానించిన కలెక్టర్, అదనపు కలెక్టర్లు

ప్రభుత్వ ఉద్యోగులుగా పని చేయడం అదృష్టంగా భావించాలి

వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్, ఫిబ్రవరి 13 : ప్రభుత్వ ఉద్యోగులుగా పనిచేయడం తమ అదృష్టంగా భావించాలని వికారాబాద్ కలెక్టర్ నారాయణ రెడ్డి అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో బదిలీపై వెళ్తున్న జిల్లా అధికారులకు ఆత్మీయ వీడ్కోలు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అధికారులు సీఈవో జానకీరెడ్డి, డిప్యూటీ సీఈవో సుభాషిణి, డీపీవో తరుణ్‌కుమార్, డీఆర్డీవో కృష్ణన్, డీడబ్ల్యూవో లలితకుమారి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ నవీన్‌చంద్ర, డీఎల్‌పీవో అనితలను కలెక్టర్ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్‌లు రాహుల్‌శర్మ, లింగ్యానాయక్, అధికారులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అధికారులు అంకితభావంతో ప్రజలకు సేవలందించే క్రమంలో సంతృప్తిని కలిగిస్తుందన్నారు. పది మందికి మేలు చేసినప్పుడే ఉద్యోగానికి న్యాయం చేసిన వారమవుతామని తెలిపారు. జిల్లాలో సమర్థవంతంగా పనిచేసిన అధికారులు బదిలీ అయినప్పటికీ ఉద్యోగ నిర్వహణలోఎక్కడికి వెళ్లినా కొత్త ఆలోచన విధానంతో ముందుకు వెళ్లాలని సూచించారు. జిల్లాలో కష్టపడి పనిచేసే అధికారులు బదిలీ అవుతున్న క్రమంలో బాధ ఉన్నప్పటికీ ఇప్పటివరకు జిల్లాకు మీరు అందించిన సేవలు సంతృప్తిని కలిగించిందని ఆయన పేర్కొన్నారు. బదిలీ అయిన అధికారులు తాము పనిచేసే ప్రాంతాల్లో కూడా సిబ్బంది సహాయ సహకారాలతో ఉత్తమ సేవలందించాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ఉద్యోగులందరూ తమ ఆరోగ్యాన్ని కాపాడుకుంటూనే ఉద్యోగానికి న్యాయం చేయాలని కలెక్టర్ ఆకాంక్షించారు.

కార్యక్రమంలో డీఈవో రేణుకాదేవి, డీసీఎస్‌వో రాజేశ్వర్, డీఎస్సీడబ్ల్యూవో మల్లేశం, డీటీడబ్ల్యూవో కోటాజీ, డీవైఎస్‌వో హనుమంతరావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాబుమోజెస్, కార్మిక శాఖ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావు, పశుసంవర్ధక శాఖ అధికారి అనిల్‌కుమార్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ రామిరెడ్డి, మిషన్ భగీరథ ఈఈ చల్మారెడ్డి , డీఎంహెచ్‌వో పాల్వన్‌కుమార్, డీబీసీడబ్ల్యూవో ఉపేందర్, డీఎల్పీవో శంకర్‌నాయక్, ఏంపీవో నాగరాజు, జిల్లా అధికారులు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

వారసుడి కోసమే వదిలేశాడు!

- ఇద్దరు ఆడపిల్లలే పుట్టారని రెండో పెండ్లి
- భర్త ఇంటి ఎదుట పిల్లలతో కలిసి భార్య నిరసన

పెద్దఅంబర్‌పేట, ఫిబ్రవరి 13 : వారసుడి కోసం వదిలేశాడని ఇద్దరు కూతుర్లతో కలిసి భర్త ఇంటి ఎదుట నిరసనకు దిగింది ఓ భార్య. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా పెద్ద అంబర్‌పేట మున్సిపాలిటీ పరిధి తట్టిఅన్నారం ఆర్కేనగర్‌లో మంగళవారం జరిగింది. జనగామ జిల్లాకు చెందిన పల్లవి(ప్రవళిక)కి 2017లో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా జైపురికాలనీలో ఉంటున్న అమరేందర్‌తో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు ఆడపిల్లలు పుట్టారు. మగ పిల్లాడు కావాలని అమరేందర్ చిత్రహింసలకు గురిచేశాడని, ఇద్దరు ఆడపిల్లల తర్వాత నాలుగు అబార్షన్లు జరిగాయని పల్లవి ఆవేదన వ్యక్తంచేసింది. వారసుడు కావాలని వేరే పెండ్లి చేసుకుంటానని బెదిరించాడని తెలిపింది. తన అత్తామామలతో కలిసి అమరేందర్ వేధింపులకు గురిచేశాడని, తాను చనిపోయినట్టు నమ్మించి మరో అమ్మాయితో లగ్గం చేయించారని చెప్పింది. ఇదే విషయమై ఇటీవల సరూర్‌నగర్ మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు సైతం చేసినట్టు పేర్కొన్నది. జైపురికాలనీలోని ఇంట్లో తనను, పిల్లలను వదిలేసి, అత్తామామలతో కలిసి ఆర్కేనగర్‌లోని కొత్త ఇంట్లోకి మారాడని, అక్కడికి వెళ్తే దారుణంగా కొట్టారని చెప్పింది. పూట గడవడం కూడా కష్టంగా మారిందని, తనను, తన పిల్లలను చూసుకోవాలంటూ మంగళవారం ఆర్కేనగర్‌లోని అమరేందర్ ఇంటి ఎదుట బైఠాయించింది. సమీప బంధువులు ఆమెకు మద్దతు తెలపడంతో అక్కడ గందరగోళం నెలకొన్నది. ఇంటి తలుపులు కొట్టినా ఎవరూ తలుపులు తీయకపోవడంతో ఆందోళనకు దిగారు. వారంలోగా తనను, తన పిల్లలను దగ్గరకు తీసుకోవాలని డిమాండ్ చేసింది. ఆందోళన విషయం తెలుసుకున్న నాగోల్ పోలీసులు అక్కడకు చేరుకుని బాధితులకు నచ్చజెప్పి అక్కడ నుంచి పంపించేశారు.

భర్త ఇంటి వద్ద పిల్లలతో కలిసి నిరసన తెలుపుతున్న పల్లవి

సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్రనాయక్

మందులతో కుష్టు తగ్గుముఖం

రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్రనాయక్

పెద్దఅంబర్‌పేట, ఫిబ్రవరి 13 : కుష్టు ప్రమాదకరమైన జబ్బు కాదని, ప్రాథమిక దశలోనే గుర్తిస్తే మందులతో తగ్గుముఖం పట్టి తిరిగి సాధారణ స్థితికి చేరుకోవచ్చని రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్రనాయక్ అన్నారు. హింద్ కుష్టు నివారణ సంఘం వైస్ చైర్మన్ టీవీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మంగళవారం పెద్దఅంబర్‌పేట శాంతినగర్ కాలనీలో నిర్వహించిన కుష్టువ్యాధి నిర్మూలన పక్షోత్సవాల ముగింపు కార్యక్రమానికి రవీంద్రనాయక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ కార్యక్రమాన్ని నిరంతరం కొనసాగించాలని చెప్పారు. లెప్రసీలో పనిచేస్తున్నవారంతా ఆణిముత్యాలని కితాబిచ్చారు. 2027 కల్లా లెప్రసీ ఫ్రీ ఇండియా చేయాలనే పట్టుదలతో ముందుకు వెళ్తున్నామని ఆయన పేర్కొన్నారు. వ్యాధిగ్రస్తులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లెప్రసీ జాయింట్ డైరెక్టర్ జాన్ బాబు, రంగారెడ్డి, హైదరాబాద్ డీఎంహెచ్‌వోలు అరుణ, నిర్మలాప్రభావతి, శివానంద హోంసీఈవో అనంతరెడ్డి, స్లాప్ (సొసైటీ ఆఫ్ లెప్రసీ ఎఫెక్టెడ్ పర్సన్స్) రాష్ట్ర అధ్యక్షుడు రమేశ్ పాల్గొన్నారు.

పుస్తకాలు.. విజ్ఞాన మంత్రాలు

నగరంలోని దారులన్నీ పుస్తక ప్రదర్శనవైపే.. రవ్వాశ్రీహరి వేదికపై పలు పుస్తకావిష్కరణలు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 13 (నమస్తే తెలంగాణ)/కవాడిగూడ : నగరంలో దారులన్నీ ఎన్టీఆర్ స్టేడియం వైపు వెళుతున్నాయి. 36వ హైదరాబాద్ జాతీయ పుస్తక ప్రదర్శనకు పాఠకుల నుంచి విశేష ఆదరణ లభిస్తున్నది. విభిన్న రకాల సాహిత్యం అందుబాటులో ఉండటంతో అన్ని ప్రాంతాల నుంచి పిల్లలు, పెద్దలు, యువత భారీస్థాయిలో మంగళవారం ప్రదర్శనకు తరలొచ్చారు. ఈసారి ప్రదర్శనలో కొత్త ప్రచురణ సంస్థలు ఎక్కువగా వచ్చాయి. యువ రచయితలు ఎక్కువ పేజీలు ఉన్న గ్రంథాలు కాకుండా తక్కువ పేజీలతో పుస్తకాలను ముద్రించి ఆకట్టుకుంటున్నారు. మొత్తంగా పుస్తక ప్రదర్శన విజ్ఞాన జ్యోతులను వెలిగిస్తున్నది.

బాలసాహిత్యానికి డిమాండ్: హైదరాబాద్ బుక్ ఫెయిర్‌లో బాలల సాహిత్యానికి సంబంధించిన పుస్తకాలు ఎక్కువగా అమ్ముడుపోతున్నాయని స్టాల్స్ నిర్వాహకులు తెలిపారు. చిట్టి చిట్టి కథలు, కార్టూన్స్‌తో కూడిన సంభాషణలు, కలరింగ్ పుస్తకాలు, పజిల్స్ తదితర పుస్తకాలను తల్లిదండ్రులు తమ పిల్లల కోసం అధికంగా కొనుగోలు చేస్తున్నారు. ప్రతి రోజూ సుమారు 30వేలకు పైగా బాలసాహిత్య పుస్తకాలు అమ్ముడుపోతున్నాయని నిర్వాహకులు తెలిపారు. పాఠకులు 365 స్టాల్స్ కలియతిరుగుతూ.. 3 గంటలకుపైగా సమయం కేటాయిస్తుండటం విశేషం.

చర్చా కార్యక్రమంలో మాట్లాడుతున్న ముఖ్య అతిథి

చిరస్థాయిగా రవ్వా శ్రీహరి

వెనుకబడిన కులాలు ఉన్నతంగా ఎదగాలంటే చదువులో ముందుండాలని రవ్వా శ్రీహరి నేర్పిన పాఠం విద్యార్థులు ఎప్పటికీ మరిచిపోరని వక్తలు అభిప్రాయపడ్డారు. రవ్వా శ్రీహరి వేదికపై మంగళవారం 'రవ్వా శ్రీహరి రచనలు-విహంగ వీక్షణం' అంశంపై చర్చా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రొఫెసర్ పిల్లలమర్రి శ్రీ రాములు మాట్లాడుతూ భాషా సాహిత్యాలు ఉన్నంత వరకు రవ్వా శ్రీహరి పేరు తెలుగు సాహిత్యంలో చిరస్థాయిగా ఉంటుందన్నారు. నల్గొండ జిల్లాలో ఓ సామాన్య కుటుంబంలో జన్మించిన ఆయన తెలుగు విద్యార్థులను అత్యంత ప్రభావితం చేశారని చెప్పారు. అనంతరం ప్రొఫెసర్ కె. యాదగిరి మాట్లాడుతూ.. రవ్వా శ్రీహరిపై పరిశోధన చేసే భాగ్యం తనకు దక్కడంపై ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలోడాక్టర్ ఎన్.రఘు, ప్రొ.హరిజారాణి, హైదరాబాద్ బుక్ ఫెయిర్ అధ్యక్షులు జూలురు గౌరీ శంకర్, బుక్ ఫెయిర్ సెక్రటరీ ఆర్.వాసు, పరిశోధక విద్యార్థి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

డీఆర్డీవోగా శ్రీలత బాధ్యతల స్వీకరణ

కలెక్టర్ శశాంకకు పూల మొక్కను అందజేస్తున్న డీఆర్డీవో శ్రీలత

రంగారెడ్డి, ఫిబ్రవరి 13 (నమస్తే తెలంగాణ) : రంగారెడ్డి జిల్లా డీఆర్డీవోగా ఎల్.శ్రీలత మంగళవారం కలెక్టరేట్‌లోని తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ప్రభాకర్ బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో శ్రీలత డీఆర్డీవోగా బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా డీఆర్డీవో శ్రీలత కలెక్టర్ శశాంక, అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌లను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కలను అందజేశారు.



చిన్నారులకు విటమిన్-ఏ మాత్రలు వేస్తున్న ఆర్డీవో సాయిరాం, జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ దామోదర్

చిన్నారులకు విటమిన్-ఏ మాత్రలు తప్పనిసరిగా వేయించాలి

జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ దామోదర్

షాబాద్, ఫిబ్రవరి 13 : గ్రామాల్లో చిన్నారులకు విటమిన్-ఏ మాత్రలు తప్పనిసరిగా వేయించాలని జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ దామోదర్ అన్నారు. మంగళవారం చేవెళ్ల డివిజన్ పరిధిలోని షాబాద్, చేవెళ్ల, మొయినాబాద్, శంకర్‌పల్లి మండలాల్లో ఆర్డీవో సాయిరాంతో కలిసి చిన్నారులకు విటమిన్-ఏ మాత్రలు వేసే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్నపిల్లల్లో న్యూట్రిషన్ సప్లిమెంటరీ, అంధత్వ నివారణ, కంటి జబ్బుల నివారణకు విటమిన్-ఏ ద్రావణం ఇవ్వడం జరుగుతున్నదన్నారు. డివిజన్‌లో మొత్తం 18,319 మంది చిన్నారులకు మాత్రలు వేయాల్సి ఉండగా 3038 మందికి వేసినట్లు తెలిపారు. ఈ నెల 18 వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని ఆయన చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ రఘుబాబు, వేదశ్రీ, సీహెచ్‌వోలు గోపాల్‌రెడ్డి, సంతోష, మంజుల, హెల్త్ ఎడ్యుకేటర్ సుదర్శన్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అవగాహన కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి ఇందిర

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

రంగారెడ్డి జిల్లా లీగల్ సెల్ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఇందిర

షాద్‌నగర్‌టౌన్, ఫిబ్రవరి 13 : యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని రంగారెడ్డి జిల్లా లీగల్ సెల్ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఇందిర అన్నారు. షాద్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మత్తు పదార్థాలపై మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. యువత, విద్యార్థులు ఒత్తిడిని దూరం చేసుకునేందుకు చెడు వ్యసనాలకు అలవాటు పడుతూ తమ విలువైన జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారన్నారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. యువత, విద్యార్థులు తాము అనుకున్న లక్ష్యాన్ని సాధించే దిశగా ముందుకు సాగాలన్నారు. మానసిక ఒత్తిడిని దూరం చేసేందుకు లీగల్ సెల్ ద్వారా సలహాలు, సూచనలు అందిస్తామన్నారు. ధర్మ సేవా సంస్థ అధినేత నిశాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. చెడు వ్యసనాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని, యోగా, ధ్యానం అలవాటు చేసుకోవాలన్నారు. అంతకు ముందు కళాశాల నుంచి పట్టణ ముఖ్యకూడలి వరకు ర్యాలీ నిర్వహించడంతో పాటు ముఖ్య కూడలిలో మానవహారంగా ఏర్పడి మత్తు పదార్థాలతో కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. అనంతరం మత్తు పదార్థాలకు దూరంగా ఉంటామని విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కమల, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రవీ